www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 8 అక్టోబర్ 2023

5

పశ్చిమ గోదావరి

దాడులు ఆపాలి

ఐలూ ఆధ్వర్యాన న్యాయవాదుల ధర్నా

తణుకు రూరల్: న్యాయవాదులు, మీడియా సంస్థలపై ఎన్ఐఎ సంస్థల దాడులు ఆపాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం తణుకు బార్ అసోసియేషన్ ఎదుట ఐలూ ఆధ్వర్యంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కావలి మునిస్వామి మాట్లాడుతూ జాతీయ దర్యాప్తు సంస్థ న్యాయవాదులపై, మీడియా సంస్థలపై దాడులు చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. నాలుగు రోజుల క్రితం విజయవాడలోని న్యాయవాదులపై క్రిమినల్ కేసులు పెడుతున్నారని, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారి కేసులను వాదిస్తున్న న్యాయవాదులపై దాడులు, సోదాలు చేస్తున్నారన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. ఐలూ జిల్లా కమిటీ సభ్యులు కొారు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజు, బి.భాస్కరరావు, ఏలేశ్వరరావు, జనార్ధన్, ఆర్.రామయ్య పాల్గొన్నారు.

చేప రైతు విలవిల..!

రూప్‌చంద్ చేపల సాగు చేసే రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర భారీగా పడిపోవడంతో సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. పరిస్థితి ఎప్పటికి కుదుటపడుతుందో తెలియక ఆక్వా రైతులు నలిగిపోతున్నారు.

భారీగా తగ్గిన రూప్‌చంద్ ధర

కిలో రూ.70లోపే పలుకుతున్న దుస్థితి

కిలో చేప పెంపునకయ్యే ఖర్చు రూ.95

రెండు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో రూప్‌చంద్ సాగు

ధర పతనంతో లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రొయ్యల సాగు తర్వాత పెద్దఎత్తున రూప్‌చంద్ చేపల సాగు సాగుతోంది. వేలాది ఎకరాల్లో రూప్‌చంద్ సాగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కొంతకాలం క్రితం వరకూ కిలో రూప్‌చంద్ చేప ఖరీదు రూ.వందకుపైగా ఉండేది. దీంతో రైతులకు ఇబ్బంది ఉండేది కాదు. పశ్చిమబెంగాల్, బీహార్ వంటి అనేక రాష్ట్రాలకు ఎగుమతి కావడంతోపాటు స్థానికంగా ఈ చేపలను ఎక్కువగా ఉపయోగిస్తారని చెబుతున్నారు. శ్రావణమాసం, వినాయకచవితి వంటి అనేక కారణాలతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు భారీగా తగ్గిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కిలో రూప్‌చంద్ ధర రూ.70లోపే పలుకుతోంది. కిలో రూప్‌చంద్‌ను తయారు చేయడానికి అన్ని ఖర్చులూ కలుపుకుని రూ.95 వరకూ ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మేత ఖర్చు ఎక్కువ మొత్తంలో అవుతుంది. ధర పతనంతో కిలో చేపకు రూ.25 వరకూ రైతులు నష్టపోతున్నారు. ఎకరా చెరువులో నాలుగు వేల నుంచి ఐదు వేల వరకూ రూప్‌చంద్ చేప పిల్ల వేస్తారు. దిగుబడి సైతం నాలుగు టన్నుల వరకూ వస్తుంది. ధర పతనంతో ఎకరాకు రూ.2.50 లక్షల వరకూ రైతులు నష్టపోతున్నారు. ఐదెకరాల చెరువుల్లో రూప్‌చంద్ సాగు చేస్తే దాదాపు రూ.12 లక్షల వరకూ రైతులు నష్టం చవిచూడాల్సి వస్తోంది. దీంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కనీసంగా కిలో చేప రూ.80కైనా కొనుగోలు చేయాలంటూ వ్యాపారులను రైతులు కోరుతున్నారు. ఆ విధంగా కొనుగోలు చేస్తే కొంతలో కొంత నష్టాలు తగ్గుతాయని రైతులు భావిస్తున్న పరిస్థితి నెలకొంది. వేల ఎకరాల్లో సాగుతున్న రూప్‌చంద్ చేపల సాగుపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఉంగుటూరు మండలంలో ఆక్వా రైతులు, ట్రేడర్స్ సమావేశమై కిలో రూప్‌చంద్ రూ.80కు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇది అమలు జరుగుతుందా, లేదా అనేది చూడాలి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. రూప్‌చంద్ ధర తగ్గుదలపై మత్స్యశాఖ జెడి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్‌ను వివరణ కోరగా రూప్‌చంద్ ధర కొంత తగ్గినమాట వాస్తవమేనన్నారు. దీనిపై ట్రేడర్స్‌తో మాట్లాడామని, మేత ధరలు తగ్గించడం వంటి చర్యలు చేపట్టామని వివరించారు.

రూ.80కు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని కోరాం

పాతూరి శ్రీనివాసరాజు, ఆక్వారైతు, ఉంగుటూరు

రూప్‌చంద్ చేప ధర బాగా తగ్గిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. కిలో చేప పెంపునకు అన్ని ఖర్చులూ కలుపుకుని రూ.95 వరకూ అవుతోంది. మార్కెట్లో ధర మాత్రం కిలో రూ.70లోపే ఉంది. ప్రస్తుత పరిస్థితి నుంచి రైతులు బయటపడాలంటే కిలో రూ.80కైనా కొనుగోలు చేయాలని ట్రేడర్స్‌ను కోరాము. ఆక్వారైతులు, ట్రేడర్స్‌తో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. 15వ తేదీన మరోసారి పెద్దఎత్తున సమావేశం నిర్వహించనున్నాం.

బస్సు జాతాలను విజయవంతం చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టేందుకు ఏర్పాటు చేసిన రాజకీయ ప్రత్యామ్నాయ బస్సు జాతాలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. మెంటేవారితోటలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరంకుశ పోకడలను అవలంబిస్తోందన్నారు. లౌకికవాదాన్ని నాశనం చేసి ఫాసిస్టు విధానాలను తీసుకొస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు సిపిఎం ఆధ్వర్యంలో రాజకీయ ప్రత్యామ్నాయ ప్రచారంలో భాగంగా రెండు బస్సు జాతాలు నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 26న శ్రీకాకుళం జిల్లా మందస నుంచి ప్రారంభమై నవంబరు 3న విజయవాడకు వస్తుందన్నారు. ఈ జాతా జిల్లాకు ఈ నెల 31న రాజోలు మీదుగా చించినాడ చేరుకుని నంబరు 2న ఉండి, ఆకివీడు మీదుగా కృష్ణా జిల్లాకు వెళ్తుందన్నారు. బస్సు జాతాలో ప్రజలు కార్యకర్తలు, మేధావులు పాల్గొనాలని, ప్రభుత్వ నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నవంబరు 7న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఇంధన, గ్యాస్, వంట నూనె, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, పి.ప్రతాప్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

కార్మికులను పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

జిల్లాలో పలుచోట్ల ఆశాల ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ అధికారుల ఒత్తిడి కారణంగా ప్రాణాలుకోల్పోయిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం భీమవరంలో తాలూకా సెంటర్లోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు ఎస్.లారెన్స్ కుమారి మాట్లాడారు. ఆరోగ్య సురక్ష పేరుతో ఆశా కార్యకర్తలను ఇష్టానుసారం ఒత్తిడికి గురిచేయడం వల్లే వారు ప్రాణాలు కోల్పోతున్నారని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా ఒత్తిడికి గురిచేస్తూ ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, రాజేశ్వరి, కుమారి, అన్నపూర్ణ, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరంలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

పెనుమంట్ర : తాడేపల్లిలో ప్రభుత్వ ఒత్తిళ్లతో మృతి చెందిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగుబాటి జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం మార్టేరు పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు శాంతియుతంగా నిరసన తెలిపి డాక్టర్ ఎస్‌కె.సవీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం పేరుతో ఆశా వర్కర్లకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారన్నారు. చనిపోయిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి కోరారు. ఈ కార్యక్రమంలో వి.లక్ష్మి, డి.లావణ్య, జె.శాంతి, డి.కుమారి, జై.వరలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్రలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

పెనుగొండ : చనిపోయిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిఐటియు మండల అధ్యక్షుడు గంగారావు డిమాండ్ చేశారు. అలాగే అక్రమంగా అరెస్టు చేసిన ఆశా, సిఐటియు నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిద్ధాంతం పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కడలి త్రినాథ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యలమంచిలి : ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరుతూ దొడ్డిపట్ల, మేడపాడు, యలమంచిలి పిహెచ్‌సిల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు మండల అధ్యక్షులు కె.శ్రీవర్ధిని, కార్యదర్శి దేవ సుధాకర్, కార్యకర్తలు రమణ, సునీత, రాజేశ్వరి, శారద, నర్సమ్మ, సూర్యావతి, మహాలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని లంకలకోడేరు పిహెచ్ వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ లక్ష్మి, శిరోమణి, కృపమేరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల భద్రత గాలికి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

కార్మికుల సంక్షేమాన్ని, భద్రతను గాలికొదిలేసి ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో కాలక్షేపం చేస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ విమర్శించారు. శనివారం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులైన మహిళా కార్మికులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ విఆర్‌ఆర్ పరిశ్రమలో విషవాయువులు తగిలి ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళా కార్మికులను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన కార్మికులు ఇక్కడ పరిశ్రమలో సరైన సౌకర్యాలు, భద్రత, కనీస వేతనాలు లేక అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. తక్షణం సహాయక చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికుల సంక్షేమం, కాలుష్యం నివారణ భద్రత వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ, ఆక్వా పరిశ్రమల యూనియన్ నాయకులు ఎస్‌కె.భాష, నిజాముద్దీన్ ఉన్నారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఆదేశాల మేరకు భీమవరం 3వ అనదపు జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద బీమా కేసులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూ నష్టపరిహారం కేసులు రాజీ చేసుకునేందుకు ప్రత్యేక లోక్ అదాలత్ ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఛైర్ పర్సన్ సత్యదేవి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి త్వరితగతిన కేసుల నుంచి విముక్తి పొందేందుకు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని కోరారు.

కోపల్లెలో అధికారుల బృందం పర్యటన

అమ్మోనియా గ్యాస్ లీకేజీపై విచారణ

ప్రజాశక్తి - కాళ్ల

సిఎంఒ కార్యాలయం, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు అధికారులు హుటాహుటీన కోపల్లె గ్రామంలో అమ్మోనియా గ్యాస్ లీకైన ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. కోపల్లెలో శుక్రవారం ప్రభు ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీకై పక్కన ఉన్న ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీలో మహిళా కార్మికులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. రెవెన్యూ, కార్మిక, వైద్య, పోలీస్, పరిశ్రమలు, పొల్యూషన్ శాఖ అధికారుల బృందం శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్‌డిఒ దాసి రాజు అధ్యక్షతన ఫ్యాక్టరీలో ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఐస్ ఫ్యాక్టరీ యజమాని సత్యనారాయణకు చెందిన ఫ్యాక్టరీతో పాటు ఇతర ఆస్తులు కూడా ఎన్ఫోర్స్మెంట్ ఆధీనంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఐస్ ఫ్యాక్టరీ నాలుగేళ్లుగా సరిగ్గా పనిచేయడం లేదని, రెండేళ్ల క్రితం మూసివేశారని తెలిపారు. అయితే శుక్రవారం ఫ్యాక్టరీలో ఉన్న కంప్రెసర్‌ను తొలగిస్తుండగా అమ్మోనియా గ్యాస్ లీకై 10 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారని, ప్రథమ చికిత్స అందించగా వారిలో ఆరుగురు కోలుకోగా, నలుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. మహిళా కార్మికులంతా ఒరిస్సా రాష్ట్రానికి చెందినవారని, ఐస్ ఫ్యాక్టరీ క్లోజింగ్ సర్టిఫికెట్ ఇచ్చారా లేదా అనేది పరిశీలించాల్సి ఉందని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు. ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ కాళ్ల మండలంలో ఐస్ ఫ్యాక్టరీలు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కువగా ఉన్నాయని, యజమానులు అమ్మోనియా గ్యాస్ పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫ్యాక్టరీ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల తనిఖీ శాఖల అధికారి రామకృష్ణారెడ్డి, ఏలూరు ఉప కమిషనర్ ఆర్.త్రినాధరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, డిఎస్‌పి బి.శ్రీనాథ్, కాళ్ల పిహెచ్‌సి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కోపల్లె ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీకైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో మరో విద్యుత్ పోరాటానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం హెచ్చరించారు. శనివారం సిపిఎం పట్టణ కమిటీ సమావేశం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు అధ్యక్షతన మెంటేవారితోట సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలకు జగన్ ప్రభుత్వం తలవంచి వివిధ రకాల విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ట్రూ ఆప్, రకరకాల ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేసుకోవడానికి పనుల్లేక వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఇప్పటికైనా ప్రభుత్వాలు ధరలను అరికట్టి, పెంచిన విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశలవారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ పేదలకు టిడ్కో ఇళ్లు ఇంతవరకూ ఇవ్వలేదని ఒక పక్క వడ్డీలు కట్టలేక మరోపక్క బ్యాంకు అధికారులు ఒత్తిడి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, టిడ్కో ఇళ్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, బి.చైతన్యప్రసాద్, బి.త్రిమూర్తులు, ఎన్.అప్పన్న, బి.వరలక్ష్మి పాల్గొన్నారు

ఆకివీడు : ప్రభుత్వం రైతులను నిలువునా నష్టపరుస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల జరిగింది. ఈ సందర్భంగా బలరాం పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ధరలు నెలనెలా పెంచడం సరికాదన్నారు. మరోపక్క మార్కెట్లో సరైన ధరకు కొనే నాధుడు లేక ఆక్వా రైతు గందరగోళ పరిస్థితి ఎదుర్కొంటున్నాడని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, పెంకి అప్పారావు, బి.రాంబాబు, డోకల్ రవితేజ, ఎస్.సూరిబాబు, ఎస్‌కె.వలీ పాల్గొన్నారు.

విలవిల..!

బకాయి వేతనాల కోసం స్కూల్ స్వీపర్ల దీక్షలు.. మూడు నెలలుగా జీతాలందక సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళనలు.. లోటు వర్షపాతంతో మెట్ట రైతులు లబోదిబోమంటున్నారు. ఇటు ప్రభుత్వ తీరు.. అటు ప్రకృతి కన్నెర్రతో రెండు జిల్లాల్లో వివిధ తరగతుల ప్రజలు విలవిల్లాడుతున్నారు.

స్కూల్ స్వీపర్లు సుమారు 300 మందికిపైగా రెండు జిల్లాల్లోని ఏలూరు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు తదితర మున్సిపాల్టీల్లో పని చేస్తున్నారు. వీరికి గతంలో ఆయా మున్సిపాల్టీలే జీతాలు చెల్లించేవి. వీరు పార్ట్‌టైమ్ కంటింజెంట్ వర్కర్స్‌గా చెబుతున్నా ఉదయం నుంచి సాయంత్రం వరకూ గదులు, గ్రౌండ్ శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం వంటి పనులన్నీ చేస్తూ ఫుల్‌టైమ్ వర్కర్లుగానే ఉన్నారు. వీరికి ఇచ్చే వేతనం మాత్రం రూ.4 వేలు మాత్రమే. 2022 ప్రభుత్వం జిఒ తీసుకొచ్చి వీరిని విద్యాశాఖలో విలీనం చేసింది. అయితే విద్యాశాఖాధికారులు మాత్రం వీరికి వేతనాలివ్వడం లేదు. అయితే మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకూ తమ అధీనంలో పని చేశారనే సానుకూల దృక్పథంతో 2023 మార్చి వరకూ వేతనాలు చెల్లించారు. అయితే విద్యాశాఖకు వెళ్లారనే జిఒ కారణంగా ఏప్రిల్ నుంచి వీరికి మున్సిపాల్టీలు వేతనాల చెల్లింపు నిలిపివేశాయి. జిఒ ప్రకారం వేతనాలివ్వాల్సిన విద్యాశాఖ మొద్దునిద్ర వీడటం లేదు. ఫలితంగా గత ఐదు నెలలుగా వేతనాలు లేక చిరుద్యోగులైన స్కూల్ స్వీపర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతూ, పేరుకు పార్ట్‌టైమ్ కంటింజెంట్ వర్కరే అయినా స్కూల్‌లోనే పూర్తి టైమ్ ఉంటూ వేరే పని చేసే అవకాశం లేక, మరోపక్క కొద్దిపాటి వేతనమూ అందక ఆ కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. సుమారు ఐదు రోజులుగా తమ బకాయి వేతనాలు ఇవ్వాలని స్కూల్ స్వీపర్లు ఏలూరులోని డిఇఒ కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు చేపట్టినా అటు విద్యాశాఖాధికారులుగాని, ఇటు అధికారపార్టీ ప్రజాప్రతినిధులుగానీ స్పందించకపోవడం బాధాకరం. వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాలు సైతం రూ.నాలుగు వేలు వేతనం కూడా బకాయిలు పెట్టడంపై ప్రభుత్వ తీరును ఎండగడుతూ స్కూల్ స్వీపర్లకు సంఘీభావం ప్రకటిస్తున్నారు. ఇదే పరిస్థితి సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల దుస్థితి. ఇప్పటికి మూడు నెలలుగా వేతనాల్లేక ఆ శాఖలోని వివిధ తరగతుల సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమకు వేతనాలిప్పించాలంటూ గాంధీ జయంతి నాడు గాంధీ విగ్రహాలకు వినతులిచ్చి నిరసన తెలిపారు. వీరికి జీతాలివ్వడానికి బడ్జెట్ లేదంటున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు మాత్రం కొంతమంది ఎంపిక చేసిన విద్యార్థులతో అమెరికా పర్యటనకు వెళ్లొచ్చారు. విద్యార్థులను ఈ తరహా పర్యటనకు తీసుకెళ్లడం కచ్చితంగా అభినందనీయమే. అయితే ఆ శాఖలో పని చేసే స్కూల్ స్వీపర్లకు, అనుబంధ విభాగమైన సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలివ్వకుండా పస్తులుంచడం ఎంతవరకూ న్యాయమో ప్రభుత్వం, ఉన్నతాధికారులే చెప్పాలి.

ఇక జిల్లాను లోటు వర్షపాతం వెంటాడుతోంది. ఇటీవలకాలంలో ఎన్నడూ లేనివిధంగా వర్షాభావంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో పరిస్థితి దారుణంగా తయారవుతోంది. చెరువులు అడుగంటడం, బోర్లు సరిగ్గా పని చేయని పరిస్థితి రావడంతో పంటలు ఎండిపోవడంతో పాటు పశువులు దాహార్తితో అలమటిస్తున్నాయి. ఇప్పటికే గత నాలుగు నెలల్లో జులై మినహా జూన్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం లోటు స్పష్టంగా లెక్కలు చెబుతున్నాయి. అయినా ప్రభుత్వంగానీ, జిల్లా అధికారులుగానీ దీనిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. ప్రత్యామ్నాయ పంటల సాగు, పశువుల తాగునీటి కోసం ప్రత్యేక చర్యలతోపాటు ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు చూపడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. లేనిపక్షంలో పచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కరువు కోరలు చాచే ప్రమాదం పొంచి ఉంది. ఎన్నికల హడావుడిలో నిమగ్నమైన అధికార పక్షం, అధికారులు ఈ సమస్యలపై ఇప్పటికైనా దృష్టి సారించకపోతే కచ్చితంగా ఎన్నికల్లో ఆయా శక్తులు, ప్రజలు గుణపాఠం చెబుతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

9న మోటార్ సైకిళ్ల ప్రచార యాత్ర

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో అధ్వాన స్థితిలో ఉన్న ఆర్‌అండ్‌బి రహదారుల దుస్థితిపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 9న మోటార్ సైకిళ్లపై ప్రచారయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కమిటీ తెలిపింది. శనివారం విలేకర్ల సమావేశంలో జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ 2020 నుంచి అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బి రహదారులకు మరమ్మతులు చేయాలంటూ నవుడూరు సెంటర్ నుంచి వీరవాసరం వరకూ పాదయాత్ర చేసి ఆయా శాఖాధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. అదే సంవత్సరం వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ వద్ద నిరసన దీక్ష చేశామన్నారు. మరలా ఆర్‌అండ్‌బి కార్యాలయం వద్ద ధర్నా చేసినట్లు తెలిపారు. మడుగుపోలవరం నుంచి నవుడూరు సెంటర్ వరకూ వచ్చే ఆర్‌అండ్‌బి రోడ్డు వెడల్పు చేయాలంటూ నవుడూరు సెంటర్లో నిరసన తెలిపామని, తరువాత కొణితివాడ నుంచి భీమవరం కలెక్టరేట్ వరకూ మోటార్ సైకిళ్లపై యాత్ర చేసి స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఈ నెల 9న మడుగుపోలవరం లంక నుండి భీమవరం కలెక్టరేట్‌కు మోటార్ సైకిళ్లపై ప్రచార యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాళ్లబండి నారాయణమూర్తి, కేతా జ్యోతిబసు, లింగం సత్యనారాయణ, టి.రాములు పాల్గొన్నారు.

సిబిఐ ఎఎస్‌పికి బిసి సంఘాల నాయకుల సత్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు

సిబిఐ డిపార్ట్‌మెంట్ న్యూఢిల్లీలో డిఎస్‌పిగా పనిచేస్తూ ఇటీవల అడిషనల్ ఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందిన బండి పెద్దిరాజును మండలంలోని బిసి సంఘాల నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా బంటుమిల్లిలోని ఆయన నివాసంలో బండి పెద్దిరాజును శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఒక కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి సిబిఐలో అడిషనల్ ఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందడం సాధారణమైన విషయం కాదన్నారు. యువత బండి పెద్దిరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బండి పెద్దిరాజుకు విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్, గొరగనముడి మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు, ఆరేపల్లి శ్రీను, చేబోలు బాలాజీ, సురగని తాతారావు, మల్లుల శ్రీనివాస్, సొసైటీ ఛైర్మన్ లక్ష్మణ్ అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్రంలో అర్హులందిరకీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైసిపి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మండలంలోని వరదరాజపురంలో కెవిపి ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన వైసిపి గణపవరం, నిడమర్రు మండలాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలన్నింటిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. గణపవరం, నిడమర్రు ఎంపిపిలు దండు వెంకటరామరాజు, ఆదిలక్ష్మి, సూర్యబలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్, శెట్టి అనంతలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, జెడ్‌పిటిసి సభ్యులు కోడే కాశి పాల్గొన్నారు.

వీరవాసరం : వైసిపి ముఖ్య కార్యకర్తలు, నాయకుల కార్యక్రమాన్ని పార్టీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ మాటిస్తే నెరవేరస్తాడనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించిన వ్యక్తి జగన్ అన్నారు. నవరత్నాలు ద్వారా అర్హులందరికీ పథకాలు అందించామని చెప్పారు. ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతులు ఇకెవైసి రెండు రోజుల్లో మాత్రమే తమ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని పొలమూరు, భట్లమాగుటూరు, ఆలమూరు రైతు భరోసా కేంద్రాల్లో ఇ కెవైసి నమోదు వివరాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో 6886 రైతులకు 6200 నమోదు చేయగా 600 మంది రైతులు నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు పూర్తయిన తర్వాత ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులు నమోదు చేయించుకున్న లిస్టులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల్లో వాటిని రైతులు పరిశీలించుకుని మార్పులు, చేర్పులు చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎ.జ్యోషిల, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రజా సంకల్ప యాత్రలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

పెదఅమిరంలో ప్రజా సంకల్పయాత్ర

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలకు అత్యంత చేరువవ్వడమే ప్రజా సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. మండలంలోని పెదఅమిరంలో ప్రజా సంకల్ప యాత్రను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో రూ.23 కోట్లు సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల అభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం పెదఅమిరంలో లూథరన్ ప్రార్థనా మందిరం రోడ్డులో రూ.23 లక్షలతో నిర్మించే సిమెంట్‌రోడ్డుకు గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు పాల్గొన్నారు.

కళాశాలలో దాండియా నృత్యాలకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎంఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా దాండియా శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి శనివారం ప్రారంభించారు. దాండియా నేర్పించడానికి రిసోర్స్‌పర్సన్‌గా డాక్టర్ ఎస్.భాగ్యలక్ష్మి, పాలకొల్లు విచ్చేసి విద్యార్థినులకు శిక్షణను ప్రారంభించారు. భాగ్యలక్ష్మికి కళాశాల ప్రిన్సిపల్ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, సాంస్కృతిక విభాగం కన్వీనర్ డాక్టర్ వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళల్లో ఆత్మవిశ్వాసం మరింత పెరగాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థినుల పరిచయ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ బ్రిజేష్ హాజరై మాట్లాడుతూ మహిళల్లో ఆత్మవిశ్వాసం మరింత పెరగాలని, ప్రతి రంగంలోనూ తమ ప్రత్యేకతను చాటాలని చెప్పారు. కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ గాదె జనార్దన గుప్తా మాట్లాడుతూ ఎందరో దాతల సహకారంతో కళాశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రిన్సిపల్‌ను అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ కళాశాల ఉత్తమ గ్రేడ్-బి డబల్ ప్లస్ సాధించటంలో సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలే ప్రధానాంశంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, కొమ్ముల మురళీకృష్ణ, పూర్వ విద్యార్థినుల కమిటీ ప్రెసిడెంట్ నాగమణి, బారిష్టర్ నారాయణరావు, స్టూడెంట్ కమిటీ ప్రెసిడెంట్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్ వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అన్నా క్యాంటీన్ వద్ద 1020వ రోజు శనివారం పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి సతీమణి సత్యవతి మూడో వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కలిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మాముడూరులో పేకాటస్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ షేక్‌మదినాబాషా తెలిపిన వివరాల ప్రకారం... మాముడూరులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,770 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు బైకులు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామాభివృద్ధికి వంశీకృష్ణంరాజు సేవలు అమోఘం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

కుముదవల్లిలో రూ.67 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

కుముదవల్లి గ్రామాభివృద్ధికి గ్రామ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు అందిస్తున్న సేవలు అమోఘమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. కుముదవల్లి బివి.రాజు కాలనీలో ఇటీవల రూ.10 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీని సర్పంచి వంశీకృష్ణంరాజు, భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు)లతో కలిసి శనివారం ప్రారంభించారు. గ్రామస్తులకు సురక్షితమైన నీటిని అందించేందుకు జల జీవన్ మిషన్ పథకంలో రూ.40 లక్షలతో ఒహెచ్ఆర్ ట్యాంకు, పైపులైన్ నిర్మాణానికి, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు, చెరువు చుట్టూ రూ.7 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ సర్పంచి వంశీకృష్ణంరాజు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం అభినందనీయమన్నారు. గ్రామస్తులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి వంశీకృష్ణంరాజు కృషి చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ప్రజలకు సమానంగా అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో పార్టీకి అండగా ఉండాలని కోరారు. అనంతరం బివి.రాజు కాలనీవాసులు పివిఎల్‌ను, వంశీకృష్ణంరాజును, ఎంపిపి చంటిరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎఎంసి ఛైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్ర వర్మ, వైసిపి ముఖ్య నేతలు పెనుమత్స శ్రీనివాస్‌రాజు, భూపతిరాజు రమేష్‌రాజు, అంగర సత్తిబాబు, దుండి అశోక్‌బాబు, వైసిపి గ్రామ నాయకులు ముసలయ్య, సూరిబాబు, రామ్మూర్తి, సత్యమ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సర్పంచి వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పివిఎల్ ప్రారంభించారు. వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పివిఎల్, ఎంపిపి చంటిరాజు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సర్పంచి వంశీకృష్ణంరాజు అధ్యక్షత వహించగా పివిఎల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బొల్ల శ్రీనివాస్, జంగం సూరిబాబు, గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు), యూత్ విభాగం మండల అధ్యక్షులు పెనుమత్స వెంకటరాజు (బాబు), నాయకులు పాల రాధాకృష్ణ, హనుమంతరావు, వెంకటరాజు, బి.రాంబాబు, ఎంపిడిఒ మురళీగంగాధరరావు, పంచాయతీ కార్యదర్శి కానూరి రాజేష్, ఆర్ఐ నాగభూషణరావు పాల్గొన్నారు.

సహకారం మరువలేను : సర్పంచి వంశీకృష్ణంరాజు

గ్రామాభివృద్ధికి డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, ఎంపిపి చంటిరాజు, అధికారులు, గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనని కుముదవల్లి సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు అన్నారు. గ్రామాభివృద్ధికి పివిఎల్ ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పివిఎల్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ఉండిలో పివిఎల్‌ను ఎంఎల్‌ఎగా గెలిపించేందుకు అంతా కృషి చేయాలన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

డిఆర్‌ఒ కృష్ణవేణి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు అయ్యి నివాసం ఉంటున్న కుటుంబాలకు తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు తక్షణం కల్పించాలని సంబంధిత అధికారులను ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ఆదేశించారు. మండలంలోని రుస్తుంబాద గ్రామ పంచాయతీ మంగళ్లగుంటపాలెం జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను సంబంధిత అధికారులతో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహ ప్రవేశాలు అయ్యి నివాసం ఉంటున్న కుటుంబాలకు తాగునీరు సరఫరా చేయాలని, మౌలిక సదుపాయాల పనులు మిగిలి ఉంటే పూర్తి చేయాలని పురపాలక సంఘం కమిషనరును ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తయిన గహాల్లో మౌళిక వసతులను కల్పించి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. విద్యుద్దీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డిజిటల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్స్ పనితీరును మార్చుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. నేటి వరకు గృహ నిర్మాణాల పనుల ప్రగతిని ఫొటోగ్రాఫ్‌తో సహ సమర్పించాలని డిజిటల్ అసిస్టెంట్లను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇఇ బి.వెంకటరమణ, పురపాలక సంఘం కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిఇ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గరాజుకు పివిఎల్ నరసింహరాజు పరామర్శ

నరసయమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు మాతృమూర్తి భూపతిరాజు వెంకట నరసయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భూపతిరాజు జగ్గరాజు కుటుంబ సభ్యులను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు శనివారం పరామర్శించారు. వెంకట నరసయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు భూపతిరాజు వెంకట జగ్గరాజు గ్రామ సర్పంచిగా పని చేస్తున్నారు. వెంకట నరసయమ్మ మృతికి ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి కోశాధికారి మంతెన వెంకట రవివర్మ, మంతెన రామకృష్ణంరాజు, సుదాబత్తుల శివనాగరాజు, దాట్ల రామభద్రిరాజు సంతాపం తెలిపారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలని వినతి

తణుకు రూరల్ : తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వా సుపత్రి స్థాయికి అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరుతూ ఎపి మెడికల్ ఎంప్లాయిస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అరుణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మెడికల్ ఎంప్లాయిస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ 40 పడకలుగా ఉన్న తణుకు ఏరియా హాస్పిటల్‌ను 150 పడకలకు పెంచుతూ జిల్లా కేంద్ర ఆసుపత్రిగా విస్తరించినట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా అనేక నూతన భవనాలు నిర్మించినప్పటికీ 40 పడకలుగా ఉన్నప్పటి ఏరియా హాస్పిటల్ స్థాయికి అనుగుణంగా అప్పట్లో నియమించిన 18 మంది కార్మికులతోనే పారిశుధ్య పనులు చేయిస్తున్నారన్నారు. 150 పడకల హాస్పిటల్ స్థాయికి అనుగణంగా పారిశుధ్య పనుల నిర్వహణకు 120 మంది కార్మికులను నియమించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు వి.సూరమ్మ, టి.భారతి, పి.రేణుక, ఎం.బేబి, వెంకటరత్నం, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న మెడికల్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ వర్కర్స్

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ఆచంట : కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజా ఆరోగ్యమే సిఎం జగన్ లక్ష్యమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని కొడమంచిలిలో రెండో రోజు శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేదవారికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, కందరవల్లి సర్పంచి, బోడపాటి బుల్లియ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు సాక సురేష్, పార్టీ నాయకులు పుచ్చకాయల నాగార్జున, బొక్కా మల్లేశ్వర రావు, కుసుమె నారాయణమూర్తి, ముత్యాల నాగేశ్వరరావు, కొండేటి భవాని ప్రసాద్, మొల్లేటి రామకృష్ణ, నల్లూరి చందు, బొంతు శ్రీను, గుబ్బల రామకృష్ణ పాల్గొన్నారు.

మండలంలోని కొడమంచిలి గ్రామంలో సచివాలయం-2 పరిధిలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ నరసింహప్రసాద్ శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో మాట్లాడి సురక్ష కార్యక్రమంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. సుమారు 545 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మరో 20 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం వివిధ ఆసుపత్రులకు తరలించినట్లు ఆరోగ్యశ్రీ టీం లీడర్ రాంబాబు, ఆరోగ్య మిత్ర సలాది కనకదుర్గ తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు దిగుపాటి జితేంద్ర, రామాంజనేయులు, వేణుబాబు, సత్యవతి, సర్పంచి సుంకర సీతారామ్, డిఇఒ నాని, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : జుత్తిగలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం, వారి జీవితాల్లో వెలుగు నింపడం కోసం సిఎం జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తమనం పూడి వీర్రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపిడిఒ పి.పద్మజ, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ పాల్గొన్నారు. సోమ రాజు ఇల్లింద్రపర్రు గ్రామ అధ్యక్షుడు కొవ్వూరి వెంకట సూర్య భాస్కర్‌రెడ్డి తల్లి పుణ్యవతి ఇటీవల మృతి చెం దారు. ఎంఎల్ఎ వారి నివాస గృ హానికి విచ్చేసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గణపవరం : మండలంలోని కాశిపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్నిఎంపిడిఒ జి.జ్యోతిర్మయి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, పిప్పర పిహెచ్‌సి డాక్టర్ కె.ప్రయాంక, ఎస్.కిరణ్మయి, ఎస్‌కె.రషీద్, చైతన్య కిరణ్, వైసిపి నాయకులు సిల్వర్ స్టర్ రాజు, ఆరోగ్య సహాయకులు నామాలరాజు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని ములపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి సిఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, మార్కెట్ యార్డ్ ఛైర్ పర్సన్, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం నార్త్‌లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పేరు పాలెం వెంకన్న, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, కర్రి ఏసుబాబు, దొంగ సత్యనారాయణ, ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం, కందులపాటి రాజేశ్వరి, నేదునూరి శ్రీను, పోతుల రమేష్, రేవు రాంబాబు పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గవెంకటాచార్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, నాయకులు బులుసు వెంకట రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు రెడ్డి శ్రీను, బేతాళ పుష్ప, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : మండలంలోని దర్భరేవు గ్రామ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సందర్శించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల కోసం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత దర్భరేవు గ్రామంలో రూ.24 లక్షలు జిజిఎం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, గ్రామ సర్పంచి విజయలక్ష్మి, మర్రితిప్ప గ్రామ సర్పంచి చిమ్మిలి నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ కలిదిండి వెంకట నరసింహరాజు, ఎంపిపి ఉంగరాల రమేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఆచంట

చంద్రబాబు అరెస్టుపై ఆచంటలో టిడిపి నేతలు చేపట్టిన నిరాహార దీక్షలు శనివారం 25వ రోజుకు చేరుకున్నాయి. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందన్నారు. ప్రజల్లో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి జగన్‌కు భయం పట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మీరయ్య, నాయకులు గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామ్మూర్తి, నెక్కంటి ప్రభాకర్, కేతా మురళి, బాలాజీ, చిలుకూరి సీతారాం, నరసింహమూర్తి, సుధా కర్, సత్యనారాయణ, శ్రీనివాస్, దొంగ నాగార్జున, జక్కంశెట్టి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ప్రసాద్, హరి పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుపై పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 25వ రోజుకు చేరాయి. చంద్రబాబును విడుదల చేయాలని టిడిపి నేతలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గొట్టుము క్కల సత్యనారాయణరాజు, దేవెళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి : ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో శనివారం గరగపర్రు దళిత ఉద్యమ నాయకులు సిరింగుల వెంకటరత్నం పాల్గొని మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలను వైసిపి మోసం చేయడమే కాకుండా ప్రతిపక్ష పార్టీలపై కుట్రపూరితంగా వ్యవహరిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతుందన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దీక్ష చేపట్టిన వారికి ఎంఎల్ఎ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ నాయకులు గొల్ల విక్టర్‌బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కాంతితో క్రాంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి బాబు, జివి, మేడిశెట్టి కేశవ పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలోని ఐ భీమవరంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ పిలుపుమేరకు కాంతితో క్రాంతి అనే కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నవకోట్ల రామారావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల రవికుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు జంపన్న రాజన్నరాజు, గ్రామ ప్రముఖులు కనుమూరు పెద్దిరాజు, మొదటి సుబ్బరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండల కేంద్రమైన మొగల్తూరులో టిడిపి నాయకులు కాగడాలతో ప్రదర్శన చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు పిడిఆర్ కాంప్లెక్స్ నుంచి స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం వరకు కాగడాలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడిశెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్‌బాబు, బల్ల శ్రీను, పాల రాంబాబు, గోపాలం, బస్వాని ఏడుకొండలు, కొల్లాటి భోగరాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తలపెట్టిన పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా పట్టణంలోని 31వ వార్డులో శనివారం టిడిపి సీనియర్ నాయకులు బళ్ల మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు పోస్ట్ కార్డులు తపాలా ద్వారా పంపి నిరసన తెలిపారు.

కల్వర్టు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని గుమ్మలూరు గ్రామపంచాయితీ పరిధిలోని రావిగొప్ప వద్ద కల్వర్టు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, శాఖ కార్యదర్శి రాపాక వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. సిపిఎం శాఖ సమావేశం కేతా సత్యనారాయణ అధ్యక్షతన శనివారం రావిగొప్పలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రావిగొప్పలో కల్వర్టు నిర్మించాలని గ్రామ పంచాయతీకి, ఎంఎల్ఎకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వర్టు నిర్మించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు కాలవలో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే కల్వర్టు నిర్మించాలని కోరారు.

విద్యార్థులకు టీ షర్టులు అందిస్తున్న వక్తలు

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

ప్రజాశక్తి - భీమవరం

క్రీడలు మానసికొల్లాసానికి దోహదపడతాయని ఆకివీడు ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, ఎస్‌కెఎం.షరీఫ్ అన్నారు. స్థానిక ఎస్‌హెచ్‌సి బిఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్పోర్ట్స్ మీట్‌లో వికలాంగ విద్యార్థులకు ఆకివీడు ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ లయన్స్ క్లబ్ ట్రెజరర్ ఎస్‌విజి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో ఏర్పడిన తాగునీటి సమస్య రెండు రోజుల్లో పరిష్కరించేందుకు తన మంతు కృషి చేస్తానని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ గడపగడపకు తిరుగుతున్న సమయంలో గ్రామస్తులు ప్రధానంగా తాగునీరు, మౌలిక వసతుల సమస్యలు చెప్పారన్నారు. రెండు రోజుల్లో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో వైసిపి ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. అనంతరం పాలకోడేరు సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి కాశీవిశ్వనాథరాజు, సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు ఆధ్వర్యంలో పివిఎల్ నరసింహరాజును, ఎంపిపి చంటిరాజును, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకటేశ్వరరావును, సర్పంచుల ఛాంబర్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లా శ్రీనివాసును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజానరేంద్రవర్మ, విస్సాకోడేరు సొసైటీ ఛైర్మన్ గడ్డం జోషి, ఎంపిటిసి సభ్యులు నాగలక్ష్మి, లక్ష్మీతులసి, శాంతకుమారి, వెంకటలక్ష్మి, షేక్ పాప సాహెబ్ పాల్గొన్నారు.

11 నుంచి సిపిఎం శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 11, 12, 13 తేదీల్లో తణుకు అమరవీరుల భవనం వద్ద సిపిఎం నిర్వహించే రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు దారులు సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను చైతన్యం చేయడానికి సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తుందని తెలిపారు.

స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులకు సూచించారు. మొగల్తూరులోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళా సమైక్య అధ్యక్షురాలు కడలి గంగాభవాని అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం విభిన్న పథకాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యాపారులుగా ఎదిగేందుకు మహిళా మార్ట్‌లు నెలకల్పామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఎం.సుభాషిని, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గణపవరం మండలం, అగ్రహారం గోపవరం గ్రామానికి చెందిన మీసాల మధు, తండ్రి: ప్రభాకరరావుకు చెందిన 122-6B నెంబరు గల దస్తావేజులు శనివారం మా గ్రామం నుండి గణపవరం వెళ్ళి జిరాక్సు తీయించుకుని ఆటోలో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికితే ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

మీసాల మధు
తండ్రి: ప్రభాకరరావు, డో.నెం. 2-135,
చర్చి వీధి, అగ్రహారం గోపవరం,
గణపవరం మండలం, ప.గో.జిల్లా.
సెల్: 96181 62767